

# ప్రజాస్పూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 26-06-2026 | సంపుటి - 29 | సంచిక -34 | రూ : 4 | పేజీలు: 8


## పీఆర్‌సీపై మాట
# నిలబెట్టుకుంటాం




- గంట అధికంగా పనిచేయండి.. రాష్ట్ర ఆదాయాన్ని పెంచండి
- రాబడి పెరిగితే మీ డిమాండ్లన్నీ నెరవేరుస్తాం
- సీఎంనైనా.. రేవంతన్న అని పిలిపించుకోవడమే ఇష్టం
- మీ కృషితోనే రెండోసారి అధికారంలోకి వస్తాం: సీఎం రేవంత్
- ఉద్యోగులకు ఉచితంగా రూ. కోటి ప్రమాద బీమా.. ఎంఓయూపై సంతకాలు

హైదరాబాద్: 'ఉద్యోగులుగా మీరేం అడుగుతారో నాకు తెలుసు.. కొత్త పీఆర్‌సీని అమలు చేస్తామని మేం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం. అక్రమార్కులను కట్టడి చేసి ప్రభుత్వ ఆదాయం పెంచండి.. మీ డిమాండ్లన్నీ నెరవేరుస్తాం. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిరోజూ ఒక గంట అదనంగా పనిచేయాలి. పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్న వారిని గుర్తించి వసూలు చేసే బాధ్యత మీదే'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉద్యోగులకు ఉచితంగా రూ. కోటి మేర ప్రమాద బీమా కల్పించేందుకు 16 బ్యాంకులతో ఎంఓయూ కార్యక్రమాన్ని గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సమక్షంలో ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, బ్యాంకుల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులనుద్దేశించి సీఎం మాట్లాడుతూ.. **తరువాయి 2లో**



## తుంగభద్ర డ్యాంకు సరికొత్త కళ.. 2లో
# 33 స్పీల్‌వే గేట్ల ప్రారంభం

- రూ. 51 కోట్లతో 33 కొత్త స్పీల్‌వే గేట్ల ప్రారంభం
- కేంద్ర, మూడు రాష్ట్రాల సీఎంల సమక్షంలో ఘనంగా కార్యక్రమం
- 2024 ప్రమాదం నేపథ్యంలో ప్రాజెక్టుకు శాశ్వత భద్రత
- తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక రైతులకు సాగునీటి భరోసా
- నవలి రిజర్వాయర్ నిర్మాణం, పూడిక తొలగింపుపై కీలక చర్చలు



## రష్యాకు భారత పెట్రోల్..
# ఉక్రెయిన్ దాడుల ప్రభావం!



- ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో దెబ్బతిన్న రష్యా రిఫైనరీలు
- భారత్ నుంచి పెట్రోల్ దిగుమతులకు రష్యా ప్రణాళిక
- దిగుమతి కంపెనీలకు సబ్సిడీల ప్రతిపాదన
- జూన్ 2026లో భారత్ రష్యా చమురు కొనుగోలు రికార్డు స్థాయికి
- రష్యాలో రోజుకు 25 వేల టన్నుల పెట్రోల్ కొరత
- ఇంధన ధరలు భారీగా పెరుగుతున్న పరిస్థితి

ఢిల్లీ : ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యాలో పెట్రోల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారత్ నుంచి పెద్ద ఎత్తున పెట్రోల్ దిగుమతి చేసుకునే దిశగా రష్యా అడుగులు వేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌కు చెందిన కీవ్ పోస్ట్ కథనం ప్రకారం.. భారత్ నుంచి సముద్ర మార్గంలో పెట్రోల్ దిగుమతులను ప్రోత్సహించేందుకు **తరువాయి 2లో**

## అయోధ్యలో నిధుల అక్రమాలు
# కీలక నిందితుల అరెస్ట్!



- అయోధ్య రామమందిర విరాళాల్లో భారీ అవకతవకలు
- హుండీ సొమ్ము కాజేసిన 8 మంది సిబ్బందిపై ఎఫ్ఐఆర్
- ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- సుమారు రూ. 7.5 కోట్లు మాయమైనట్లు ప్రాథమిక అంచనా
- సిట్ నివేదిక ఆధారంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ చర్యలు

**అయోధ్య, జూన్ 25:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసు **తరువాయి 2లో**

## చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం..
### దూరం నుంచే దెబ్బ

- చైనాను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలు రూపొందిస్తున్న భారత్
- దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- భారత్ వద్ద 24 అగ్ని-5 క్షిపణులు ఉన్నట్లు SIPRI అంచనా
- అగ్ని-5 పరిధి సుమారు 5,000 కిలోమీటర్లు
- డ్రోన్లు, సైబర్ యుద్ధ సామర్థ్యాలపై భారత్ ఫోకస్



2లో

## అమెజాన్‌లో భారత్‌కు భారీ పెట్టుబడులు
### మోదీతో సీఈఓ భేటీ



- 2026-30 మధ్య భారత్‌లో 48 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్న అమెజాన్
- ఏఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణకు అదనంగా 13 బిలియన్ డాలర్ల కేటాయింపు

2లో

## వెనిజులాలో భూకంప విలయం..
# 164 మంది మృతి



- 971 మందికి పైగా గాయాలు
- 7.2, 7.5 తీవ్రతలతో వరుస ప్రకంపనలు
- లా గ్వైరా ప్రాంతంలో భారీ విధ్వంసం
- అనేక భవనాలు కూలిపోవడంతో సహాయక చర్యలు
- ప్రధాన విమానాశ్రయం, మెట్రో సేవలకు అంతరాయం
- పలు దేశాల నుంచి సహాయక బృందాల రాక

2లో

# తుంగభద్ర డ్యాంకు సరికొత్త కళ.. 33 స్పీల్‌వే గేట్ల ప్రారంభం

హొసపేట (విజయనగర జిల్లా): తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలకు జీవనాడిగా నిలిచిన చారిత్రాత్మక తుంగభద్ర ప్రాజెక్టు మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. గతేడాది ఆగస్టులో జరిగిన గేటు ప్రమాదంతో ఆందోళన చెందిన రైతాంగానికి భరోసా కల్పిస్తూ, ప్రాజెక్టు భద్రతను పటిష్టం చేసేందుకు చేపట్టిన 33 కొత్త స్పీల్‌వే గేట్ల పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. గురువారం విజయనగర జిల్లా హొసపేట సమీపంలోని మునిరాబాద్‌లో జరిగిన ఘనమైన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి శ్రీ సిఆర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ డికె శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి సంయుక్తంగా ఈ కొత్త గేట్లను ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకావడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పక్కపక్కనే ఉన్న రాష్ట్రాల మధ్య సమన్వయానికి ఇది నిదర్శనమని, ప్రాజెక్టుపై ఆధారపడిన లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ఉమ్మడి లక్ష్యమని నేతలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక సీఎం డికె శివకుమార్ మాట్లాడుతూ, గతంలో 19వ గేటు కొట్టుకుపోయినప్పుడు భయాందోళనలు నెలకొన్నాయని, కానీ నేడు మూడు రాష్ట్రాలు కలిసి ఈ సవాలును అధిగమించామని, ప్రాజెక్టుపై ఆధారపడిన రైతుల ప్రయోజనాల కోసం చారిత్రాత్మక ఏకాభిప్రాయానికి వచ్చామని పేర్కొన్నారు. సుమారు 73 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్టు భద్రతను పరిగణనలోకి తీసుకుని, జాతీయ డ్యాం




భద్రతా సంస్థ సిఫార్సుల మేరకు రూ. 51 కోట్ల వ్యయంతో ఈ ఆధునీకరణ పనులు చేపట్టారు. పాత గేట్ల స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 33 క్రస్ట్ గేట్లను కేవలం ఆరు నెలల రికార్డు కాలంలోనే అమర్చడం విశేషం. 2024 ఆగస్టులో 19వ గేటు కొట్టుకుపోయినప్పుడు తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటుతో పరిస్థితిని అదుపులోకి తెచ్చిన అధికారులు, ఇప్పుడు అన్ని గేట్లను శాశ్వత ప్రాతిపదికన మార్చడం ద్వారా ప్రాజెక్టుకు పూర్ణ రక్షణ కల్పించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందుతోంది. కొత్త గేట్లతో నీటి నిర్వహణ మరింత సమర్థవంతంగా జరగనుంది. డ్యాంలో పేరుకుపోయిన పూడికను తొలగించడం మరియు నవలి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం వంటి అంశాలపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సమక్షంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ఉమ్మడి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమం ముగిసిన అనంతరం హొసపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న నేతలు, ఈ చారిత్రాత్మక ప్రాజెక్టు భద్రతను పటిష్టం చేయడంలో అహర్నిశలు శ్రమించిన ఇంజనీరింగ్ నిపుణులను, అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

## పీఆర్‌సీపై మాట నిలబెట్టుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)
'మీరు, మేం వేర్వేరు కాదు. మీ అనుభవాలను, ఇబ్బందులను ప్రభుత్వంతో పంచుకుంటే చర్చించి పరిష్కరిస్తాం. మీకు ఏదైనా జరిగితే.. కుటుంబ పెద్దగా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది' అని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం కొంత పెంచారని చెప్పారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

* **ఉద్యోగులు అడగకపోయినా రూ.కోటి బీమా**

సింగరేణి కార్మికులకు ప్రమాద బీమాను అమలు చేద్దామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపాదించినప్పుడు నాకు నమ్మకం కలగలేదు. ఒక్క రూపాయి చెల్లించకుండా రూ.కోటి బీమా ఎలా సాధ్యమనిపించింది. ఆయనే బ్యాంకర్లను ఒప్పించి, కార్మికులకు బీమా అమలు చేశారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున బీమా సొమ్ము అందజేసి.. సాధ్యమని నిరూపించారు. అకస్మాత్తుగా యజమానిని కోల్పోయిన కుటుంబాలకు ఆసరాగా నిలవాలనుకున్నాం. ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 శాతం మధ్యతరగతి వారే. నేనూ మధ్య తరగతి కుటుంబం నుంచే వచ్చా. ప్రమాద బీమా ఉద్యోగుల కుటుంబానికి భరోసా ఇస్తుంది. ఉద్యోగుల భద్రత బాధ్యత యజమానిదే.

## వెనిజులాలో భూకంప విలయం.. 164 మంది మృతి

వెనిజులా : వరుస భూకంపాల ధాటికి వెనిజులాలో ఇప్పటి వరకు 164 మంది చనిపోయినట్లు గుర్తించారు. మరో 971 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత వందేళ్లలో ఆ దేశాన్ని తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఇవి ఒకటిగా నమోదయ్యాయి. రాజధాని కారకాస్‌తో పాటు పలు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం సంభవించింది. ముఖ్యంగా లా గ్వైరా ప్రాంతం అత్యంత ప్రభావితమైంది. డజన్ల కొద్దీ భవనాలు నేలమట్టమవగా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. రాష్ట్ర టెలివిజన్ ప్రసారం చేసిన దృశ్యాల్లో శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన ఘటన కనిపించింది. భూకంపాల సమయంలో కారకాస్‌లో భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. పలుచోట్ల విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా నష్టం వాటిల్లడంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెట్రో సేవలను నిలిపివేయగా, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అమెరికా భూకంప పరిశోధనా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన ఉన్న మోరాన్ సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే మరో భారీ భూకంపం నమోదైంది. ఈ ప్రకంపనలు బ్రెజిల్, కొలంబియా వరకు అనిపించాయి. విపత్తు తీవ్రత దృష్ట్యా అమెరికా, మెక్సికో, ఖతార్, ఎల్‌సాల్వడార్ సహా పలు దేశాలు సహాయక బృందాలు, వైద్య సాయం పంపుతున్నాయి. ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించి సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

### అయోధ్యలో నిధుల అక్రమాలు..

## కీలక నిందితుల అరెస్ట్!

(మొదటిపేజీ తరువాయి)
శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అందజేసిన ఫిర్యాదు మేరకు గురువారం రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ట్రస్ట్ సభ్యుడు కృష్ణ మోహన్ ఫిర్యాదు ప్రకారం, ఆలయం విరాళాల పెట్టెల్లోని నగదును లెక్కించే సిబ్బంది కుట్రపూరితంగా నిధులను పక్కదారి పట్టించారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నిందితుల్లో ఆలయ ఉద్యోగులైన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, అవినాశ్ శుక్లా తదితరులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ. 7 కోట్ల నుంచి రూ. 7.5 కోట్ల మేర నిధులు అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి పోలీసులు కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. విరాళాల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, ఆలయ ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ బృందం ఇటీవలే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. ఆ నివేదికలోని ముఖ్యాంశాల ఆధారంగానే పోలీసులు తాజా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ, భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం మహా పాపమని విమర్శించారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ఇతర విపక్షాలు ఈ కేసుపై పారదర్శక విచారణ జరపాలని, అవసరమైతే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, దర్యాప్తు ప్రక్రియ కొనసాగుతున్నందున రాజకీయ నాయకులు అనవసర వ్యాఖ్యలు చేయవద్దని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి చేశారు.

## చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం..

భారత సైనిక ఆధునికీకరణ కొత్త దశకు చేరుకుంటోంది. ఒకప్పుడు ప్రధానంగా పాకిస్థాన్‌ను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలను రూపొందించిన భారత్.. ఇప్పుడు చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లపై మరింత దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణులు, అధునాతన ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. అంతర్జాతీయ పరిశోధనా సంస్థ SIPRI తాజా నివేదిక ప్రకారం.. చైనా సైనిక శక్తి పెరుగుతుండటం, పాక్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడటం భారత్ రక్షణ ప్రణాళికలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల్లోని లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే సామర్థ్యాలను భారత్ వేగంగా పెంచుకుంటోంది. గతంలో సుమారు 2,000 కిలోమీటర్ల పరిధి ఉన్న అణ్వాయుధ సామర్థ్య క్షిపణులకే పరిమితమైంది. ఇప్పుడు 3,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణించే క్షిపణులను సైన్యంలోకి తీసుకొస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 24 అగ్ని5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ క్షిపణి సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగలదని అంచనా. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, సైబర్ దాడులు, కచ్చితమైన లక్ష్యఛేదన సామర్థ్యాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్ స్వదేశీ రక్షణ తయారీపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2014-15లో రూ.46,400 కోట్లుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ.. 2024-25 నాటికి రూ.1.78 లక్షల కోట్లకు చేరుకుంది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయిలో రూ.38,400 కోట్లకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకున్న యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణలు భారత్‌కు కొత్త పాఠాలు నేర్పాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో అధునాతన డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ఆధారిత రక్షణ భాగస్వామ్యాలపై కేంద్రం మరింత దృష్టి పెడుతున్నట్లు నివేదిక పేర్కొంది.

### రష్యాకు భారత పెట్రోల్..

## ఉక్రెయిన్ దాడుల ప్రభావం!

(మొదటిపేజీ తరువాయి)
రష్యా తన పన్ను చట్టాల్లో మార్పులు చేయాలని భావిస్తోంది. భారత్ నుంచి పెట్రోల్ దిగుమతి చేసే కంపెనీలకు సబ్సిడీలు అందించే ప్రతిపాదనకు రష్యా పార్లమెంట్ బడ్జెట్ కమిటీ మద్దతు తెలిపినట్లు సమాచారం. రష్యాఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ముడి చమురుకు భారత్ అతిపెద్ద కొనుగోలుదారుగా మారింది. ప్రస్తుతం రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. 2026 జూన్‌లో ఈ దిగుమతులు రోజుకు 26.6 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరినట్లు నివేదిక పేర్కొంది. భారత్‌లోని రిఫైనరీల్లో శుద్ధి చేసిన చమురులో కొంత భాగాన్ని పెట్రోల్, ఇతర ఇంధన ఉత్పత్తుల రూపంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 2025లో భారత్ పెట్రోల్ ఎగుమతులు రోజుకు 4 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరాయి. ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు సుమారు 85 వేల టన్నుల పెట్రోల్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. వేసవి కాలంలో డిమాండ్ 1.11 లక్షల టన్నుల వరకు ఉంది. దీంతో రోజుకు దాదాపు 25 వేల టన్నుల కొరత ఏర్పడినట్లు నివేదిక వెల్లడించింది.

పెట్రోల్ కొరత కారణంగా రష్యాలో ఇంధన ధరలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు తేలికపాటి విమానాల నిర్వాహకులు విమాన ఇంధనానికి బదులుగా ఆటోమొబైల్ పెట్రోల్‌ను వినియోగించాల్సి

## మొహర్రం ఊరేగింపులో ప్రమాదకర స్టంట్..

## 40 అడుగుల ఎత్తులో కారు పేల్చివేత!

- **ఉజ్జయినిలో మొహర్రం ఊరేగింపులో ప్రమాదకర స్టంట్**
- **క్రేన్‌తో కారును 40 అడుగుల ఎత్తుకు ఎత్తిన నిర్వాహకులు**
- **కారులో బాణాసంచా పేల్చి పేలుడు జరిగినట్లు సృష్టి**
- **వీడియో వైరల్ కావడంతో పోలీసుల విచారణ**
- **నలుగురిపై కేసు నమోదు**
- **సోషల్ మీడియా ప్రచారం కోసం స్టంట్**



మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లాలో మొహర్రం ఊరేగింపులో జరిగిన ప్రమాదకర స్టంట్ తీవ్ర కలకలం రేపింది. భారీ జనసమూహం మధ్య ఓ కారును క్రేన్‌తో దాదాపు 40 అడుగుల ఎత్తుకు ఎత్తి ఆ తర్వాత పేలినట్లుగా చూపించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జూన్ 24న బద్నగర్ ప్రాంతంలో జరిగిన మొహర్రం ఊరేగింపులో ఈ ఘటన చోటుచేసుకుంది. 'లే ఫిర్ ఆ గయే' అనే నినాదంతో ఉన్న కారును క్రేన్‌తో పైకి ఎత్తగా, ఇద్దరు యువకులు ఎర్ర జెండాలు ఊపారు. కొద్ది సేపటికే కారులోంచి పొగలు, నిప్పురవ్వలు రావడంతో పాటు అద్దాలు పగిలిపోవడం కనిపించింది. దీంతో కారు పేలిపోయినట్లు అక్కడున్నవారికి అనిపించింది. వీడియో వైరల్ కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. నిర్వాహకులతో పాటు క్రేన్ యజమాని గోపాల్ మాలీపై కేసు నమోదు చేశారు. మరికొందరిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### సోషల్ మీడియా కోసం స్టంట్?

పోలీసుల ప్రాథమిక విచారణలో కారులో బాణాసంచా పేల్చినట్లు తేలింది. గ్యాస్ ఒత్తిడి పెరగడంతో అద్దాలు పగిలిపోయి పేలుడు జరిగినట్లుగా కనిపించిందని అధికారులు వెల్లడించారు. స్థానిక అఖాడాల మధ్య ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించడం, సోషల్ మీడియాలో వైరల్ కావడమే ఈ స్టంట్ ప్రధాన ఉద్దేశమని పోలీసులు అనుమానిస్తున్నారు. సంబంధిత ఇన్‌స్టా ఖాతాలో ఇలాంటి ప్రమాదకర వీడియోలు మరికొన్ని ఉన్నట్లు గుర్తించారు.

### విషాదంగా మారి ఉండేదే...

ఈ ఘటనలో ఎవరూ గాయపడకపోయినా, వందలాది మంది మధ్య ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు నిర్వహించడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొద్దిపాటి తప్పిదం జరిగినా భారీ ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉండేదని అధికారులు పేర్కొన్నారు.

## అమెజాన్‌లో భారత్‌కు భారీ పెట్టుబడులు: మోదీతో సీఈఓ భేటీ

ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈకామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది.

# విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదుగాలి

* **ఠాగూర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి :విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదుగాలని ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్ అన్నారు.రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లో గల ఠాగూర్స్ హై స్కూల్ లో 202425 బ్యాచ్ కు చెందిన జి.వైష్ణవి ఇంటర్ ఎంపిసి ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్ అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ 10వ తరగతిలో స్కూల్ తృతీయ ర్యాంకు సాధించిన వైష్ణవి పట్టుదలతో ఇంటర్ లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ ఉత్తమ ఫలితాలు సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ యేడు పదవ తరగతి రాసే విద్యార్థులు వైష్ణవిని ఆదర్శంగా తీసుకుని విద్యలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇక్కుర్తి నారాయణ రావు. రంగారెడ్డినగర్ డివిజన్ నాయకులు సతీష్ ఘట్టోజీ , పాఠశాల ఉపాధ్యాయులు శివ గోపి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఇంటి కల సహకారం చేసుకోవడం అదృష్టం

**వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : సొంత ఇంటి కల సహకారం చేసుకోవడం అదృష్టమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణం 9వ వార్డుకు చెందిన చీర్ల నాగేంద్రం, గోపాల్ పేట మండలం చెన్నారం గ్రామంలో శ్రీనివాస్ రెడ్డి, యాలాల మహేష్ గృహప్రవేశాలకి హాజరై, సత్యనారాయణ స్వామి వ్రతంల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం అనేది అదృష్టమని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి 9వ వార్డు కౌన్సిలర్ విభూతి మహేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీర్ల జనార్దన్ సగర, చీర్ల ఆంజనేయులు సగర, గోపాల్పేట మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సత్యశిలారెడ్డి, ఏదుల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, సర్పంచులు రాజవర్ధన్ రెడ్డి, రవి, సురేష్ గౌడ్, కృష్ణయ్య, పరుశురాములు, మార్కెట్ డైరెక్టర్ సురేందర్ గౌడ్, ధీరమల్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

* **హుస్నాబాద్ ఏసిపి, ఎస్. సదానందం**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : టెలికాం వినియోగదారులకు వారి హక్కులు, టెలికాం సేవలకు సంబంధించిన అంశాలు, సైబర్ మోసాలు , వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (TRAI) ఆధ్వర్యంలో గురువారం హుస్నాబాద్ వైశ్య భవన్‌లో టెలికాం వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, టెలికాం వినియోగదారులు కేబుల్ ఆపరేటర్లు, వినియోగదారుల ఫోరమ్ ప్రతినిధులు మరియు టెలికాం సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ట్రాయ్ హైదరాబాద్ కన్సల్టెంట్ ఎ. కిష్టయ్య స్వాగతం పలికి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు.అనంతరం ట్రాయ్ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ జాయింట్ అడ్వైజర్ కె.వి. సురేష్ బాబు మాట్లాడుతూ టెలికాం రంగ అభివృద్ధి, వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ట్రాయ్ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు.హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల దర్యాప్తు జరుగుతోందని, వివిధ రకాల సైబర్ మోసాల గురించి ప్రజలకు వివరించారు. ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందిస్తే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు అని అన్నారు.

# రఘునాథపల్లిలో రోడ్డు ప్రమాదం

* **గ్రామపంచాయతీ కార్మికుడు మృతి**



రఘునాథపల్లి / జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని రఘునాథపల్లి మండల కేంద్రం లో గురువారం సాయంత్రం జరిగిన విషాద కర రోడ్డు ప్రమాదం లో గ్రామ పంచాయతీ కార్మికుడు కర్రే ఎల్లయ్య (55) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,రఘునాథపల్లి బ్రిడ్జి పై ఎల్లయ్య రోడ్డు దాటుతున్న సమయం లో వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు తను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణ మైన కారు డ్రైవర్ వాహనంతో పరారైనట్లు సమాచారం.మృతుడు గత రెండు దశాబ్దాలుగా రఘునాథపల్లి గ్రామ పం చాయతీ లో కార్మికుడిగా సేవలందిస్తు న్నాడు. ఆయన ఆకస్మిక మృతి తోకు టుంబ సభ్యులు,సహోద్యోగులు, గ్రామ స్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమో దు చేశారు. పరారీలో ఉన్న కారు డ్రైవ ర్ కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాదానికి సంబంధించిన వివరాల పై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి మనందరం భాగస్వాములు కావాలి

* **ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్**





జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి మనందరం భాగస్వాములు కావాలని ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ డ్రగ్స్ దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ లో గల ఠాగూర్స్ హై స్కూల్ లో అంతర్జాతీయ డ్రగ్స్ దుర్వినియోగం అక్రమ రవాణా పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువత నుంచి చిన్న పిల్లలకు చాక్లెట్ల రూపంలో వ్యాపించిందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే తమ జీవితం సంతోషంగా ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజ శాంతి భద్రతలకు,యువత భవిష్యత్తుకూ తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతీ పౌరుడు, విద్యార్థులు యాంటి డ్రగ్ సోల్జర్‌గా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం, పర్యావరణంపై పలు సూచనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్య క్రమంలో వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇక్కుర్తి నారాయణ రావు. పాఠశాల ఉపాధ్యాయులు శివ గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓలకు ఓటర్లు సహకరించాలి: తహశీల్దార్ నాగరాజు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని చుంచుపల్లి మండల తహశీల్దార్ నాగరాజు కోరారు. మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో 2025 నాటికి మొత్తం 39,587 మంది ఓటర్లు నమోదై ఉన్నారని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఓటరు జాబితాలను నవీకరించేందుకు ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమం అమలుకు 41 మంది బీఎల్ఓలు, వారి పర్యవేక్షణకు నలుగురు సూపర్వైజర్లను నియమించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిని పూర్తి చేసి సంతకాలతో తిరిగి స్వీకరిస్తారని చెప్పారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో మండలంలో వంద శాతం ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన ర్యాలీ




జనగామ, ప్రజస్ఫూర్తి : మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా చౌరస్తా లో గురువారం డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్య లో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలన పై ప్రజలకు అవగాహన కల్పించారు. కా ర్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సి పల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శశి, డీసీపీ రాజ మహేంద్రనాయక్ హాజ రయ్యారు. వారితో పాటు సీ.ఐ సత్య నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ కౌన్సిలర్లు, పాఠశాల విద్యా ర్థులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారీ మానవహారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చట్ట పరమైన శిక్షలు, వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా లభించే సేవల గురించి అతిథులు వివరించారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని,సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా క్రీడలు, విద్య పై దృష్టి సారించి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని అతిథులు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు డ్రగ్స్ రహిత నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# యాతాలకుంట టన్నెల్‌ను పరిశీలించిన ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు

– **ఆగస్టు నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం సంయుక్తంగా పరిశీలించారు. టన్నెల్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, భద్రతా ప్రమాణాల అమలు, నిర్మాణ ప్రక్రియ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల స్థలాన్ని సందర్శించిన కలెక్టర్లు టన్నెల్ నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి, చేపడుతున్న పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పూర్తయిన పనులు, మిగిలిన పనులు, నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, పనుల వేగం, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. టన్నెల్ నిర్మాణ సమయంలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పనుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజనీరింగ్ నిబంధనలను పూర్తి స్థాయిలో పాటించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, చీఫ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు వాడకూడదని భారీ ర్యాలీ




ప్రజాస్ఫూర్తి, జన్నారం : నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వాడకూడదని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి భాస్కర్ ఆదేశాల మేరకు జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యార్థులచే గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండల కేంద్రంలోని రామాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా స్థానిక బస్టాండ్ వరకు సాగింది, యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వాడకూడదని వాటికి బానిసలుగా మారద్దని అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ నేటి యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వాడుతూ వాటికి బానిసలుగా మారుతున్నారని, అలాంటి మత్తు పదార్థాలు వాడకూడదని వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు, ఎవరైనా మత్తు పదార్థాలు ఉపయోగించిన, అమ్మిన, కొన్నా కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అజ్మీరా నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటర్ గా నమోదు కావాలి

* **హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి**



హుస్నాబాద్, ప్రజస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం లో భాగంగా గురువారం పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని కొత్త ఓటర్ల నమోదు చిరునామా మార్పులు పేరు సవరణలు , ఇతర అవసరమైన మార్పుల కోసం నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండి లక్ష్మి సూచించారు.

# వ్యర్థాల శుద్ధి ప్రక్రియ పరిశీలన

* **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: గురువారం బాలెంల గ్రామ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించి తనిఖీ చేశారు. డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఏ విధంగా శుద్ధి చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన బయో మైనింగ్ యంత్రం పనితీరు, దాని ద్వారా తడి, పొడి వ్యర్థాలను ఎలా శుద్ధి చేస్తున్నారనే అంశాల పై అధికారులతో చర్చించారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన తడి చెత్తను త్వరగా శుద్ధి చేయాలని, ఎటువంటి చెత్త నిల్వ ఉండకుండా పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మున్సిపల్ , ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన చిరంజీవి నైనిక కూచిపూడి నృత్య ప్రదర్శన



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ : నిజాంపేట్ మల్లికార్జున స్వామి ఆడిటోరియం లో చిరంజీవి గొడవర్తి నైనిక కూచిపూడి నృత్య అరంగ్రేటం ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది.కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు లయన్ ఎస్. పి . భారతి,డాక్టర్ బ్రహ్మశ్రీ జక్కా శ్రీకృష్ణ, నాట్య గురు డాక్టర్ రామాదేవిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చిరంజీవి నైనిక శివస్తుతి, భామకలాపం, తిల్లనా వంటి నృత్య రూపకాలను చక్కగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమం లో చిన్నారులు రిషిక, కార్తీకల సంగీత, వయోలిన్ వాయిద్యాలు కూడా అలరించాయి. చిన్నారి నైనిక తల్లిదండ్రులు శ్రీనివాస్, దీపావతి లు విచ్చేసిన ఆహుతులకు కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

లింగాల ఘణపురం / ప్రజస్ఫూర్తి : ఇంటి తాళం పగులగొట్టి నగదు, కిడ్డి బ్యాంక్ ను దొంగలు ఎత్తుకెళ్లారు.ఈ ఘటన, జిల్లా లోని లింగాల ఘణపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం, లిం గాల ఘణపురానికి చెందిన గదరి రేణు క (32), భర్త ఇలయ్య నివాసంలో బుధ వారం రాత్రి గుర్తుతెలియని దుండగు లు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళం ప గులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగు లు నగదు రూ.8,000 తో పాటు కిడ్డీ బ్యాంకును అపహరించినట్లు బాధితు రాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమో దు చేసుకొని, చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రవణ్ కుమార్ తెలిపారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.

# నేడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ పున: ప్రతిష్టాపన



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా రంగారెడ్డినగర్ లోని ఛత్రపతి శివాజీ చౌక్ లో శుక్రవారం మధ్యాహ్నం 12:00 గంటలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ పునః ప్రతిష్ఠాపన (ఆవిష్కరణ) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతుందని బీజేపీ మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా ప్రభారీ, భాగ్యనగర్ శివాజీ సేవా సమితి అధ్యక్షులు నందనం దివాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 32 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల సౌకర్యార్థం 6 అడుగులు ప్రక్కకు జరిపి పునః ప్రతిష్ఠించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ వివేకానంద్, స్థానిక మాజీ కార్పొరేటర్ బి. విజయ్ శేఖర్ గౌడ్ లు ముఖ్య అతిథులుగాహాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హిందూ బంధువులు, శివాజీ అభిమానులు, యువత, మహిళలు , ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక వేడుకలను, విగ్రహ పునః ప్రతిష్ఠాపన (ఆవిష్కరణ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# సర్పంచ్ వేతనం నుంచి.. వృద్ధునికి ఆర్థిక సాయం

- **ఆదర్శంగా నిలిచిన పంతంగి సర్పంచ్ శ్రీలత సుందరయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తన వేతనం నుంచి ఒంటరి వృద్ధునికి ప్రతినెల పెన్షన్ ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకొని ఆదర్శంగా నిలిచారు ఓ సర్పంచ్. వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బర్మా జంగయ్య (85) అనే వృద్ధుడు కొడుకులు, కూతుళ్లు లేక ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ ఆయనకు ప్రభుత్వ నుంచి పెన్షన్ మంజూరు కావడం లేదు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శ్రీలత సుందరయ్య వృద్ధునికి ఏదైనా సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రతి నెల సర్పంచ్ గా తనకు వచ్చే వేతనం నుంచి జంగయ్యకు రూ.1500ల ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రూ.1500ల నగదును వృద్ధుడు జంగయ్య కు అందజేశారు. ప్రభుత్వం నుంచి జంగయ్య కు పెన్షన్ వచ్చేంత వరకు తనకు వచ్చే నెలవారీ జీతం నుంచి ప్రతి నెల రూ.1,500ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ నిర్ణయం పట్ల గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. వేతనం నుంచి వృద్ధునికి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని కొనియాడారు.

# యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

- **దేవలమ్మ నాగారం గ్రామంలో అవగాహన సదస్సు**
- **సీఐ జి. మన్మధ కుమార్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా.. తమ విలువైన సమయాన్ని క్రీడలపై మొగ్గు చూపాలని చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో గ్రామ సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మాదకదవ్యాల వినియోగం జరిగే నష్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబం, సమాజం, యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు, తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు లేదా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. 100, 1062 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచబడతాయన్నారు. అనంతరం అందరితో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, బొమ్మ శ్వేత, పాక రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు కీలకం : వెన్నెల



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం,ప్రజాస్ఫూర్తి : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల పిలుపునిచ్చారు. కాటారం మండలం గంగారం గ్రామంలో టీఎస్ఎస్ కళాకారిణి జాడి సుమలత వివాహ వేడుకకు హాజరైన ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనవసర ఆరోపణలు మానుకోవాలి

- **హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మహమ్మదాపూర్ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ మృతి నేపథ్యంలో కొందరు రాజకీయ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేస్తున్న ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు బాధాకరమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్న రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ మృతి దురదృష్టకర సంఘటన అని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. అయితే ఈ విషాద ఘటనను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరైంది కాదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని, అలాంటి నాయకుడిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టించినప్పటికీ సర్పంచులకు రావాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించలేదని ఆరోపించారు. మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, అర్హులైన వారికి నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. పిట్టల సంపత్ మృతి విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయనకు సంబంధించిన బిల్లులు అలాగే ఇతర మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారని వెల్లడించారు.

## రిపోర్టర్ పాలకూరి శేఖర్ గౌడ్ కుటుంబానికి
# బి.ఆర్.ఎస్. 3 లక్షల ఆర్థిక సహాయం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ఉద్యమకారుడు, ఐబీసీ ఛానల్ రిపోర్టర్ పాలకూరి శేఖర్ గౌడ్ ఇటీవల ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే.పాలకూరి శేఖర్ గౌడ్ కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరామర్శించి మూడు లక్షల ఆర్థిక సహాయం అందజేశారు నల్గొండ మండలం అన్నెపర్తి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఐబీసీ ఛానల్ రిపోర్టర్ పాలకూరి శేఖర్ గౌడ్ ఇటీవల ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరామర్శించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశానుసారం పార్టీ తరపున బాధిత కుటుంబానికి మూడు లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి కె.టి.ఆర్ , మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కి జర్నలిస్టు లు , జర్నలిస్ట్ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమం లో ఐబీసీ ఛానల్ మేనేజింగ్ డైరక్టర్ ఏచూరి భాస్కర్ , అన్నెపర్తి సర్పంచ్ మేకల పల్లవి అరవింద్ రెడ్డి , బి .ఆర్ . ఎస్ . నాయకులు కంచర్ల కృష్ణా రెడ్డి , రేగట్టె మల్లిఖార్జున్ రెడ్డి , బోనగిరి దేవేందర్ , కార్పొరేటర్ లు దొడ్డి రమేష్, మారగోని భవాని గణేష్, రావుల శ్రీనివాస్ రెడ్డి , మృతుడు శేఖర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .



# ఇందిరమ్మ ఇంటితో.. పేదల ముఖాల్లో వెలుగులు

- **నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం**
- **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకంతో.. నిరుపేదల సొంతింటి కల సహకారమై వారి ముఖాల్లో వెలుగులు నిండుతున్నాయని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ లు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ళసింగారం గ్రామం 2వ వార్డులో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న సరిపల్లి సౌజన్య నర్సింహ్మ దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మించుకోవాలనే కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లుతో వారి కల నెరవేరుస్తామన్నారు. మున్సిపల్ వ్యాప్తంగా ప్రతి వార్డులో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న నిరుపేదల కళ్ళల్లో సంతోషం వర్ణించలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ గౌడ్, కో ఆప్షన్ మెంబర్ పస్తం గంగరాములు, చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఊదరి నర్సింహ్మ, సరిపల్లి మారయ్య, జంపాల కృష్ణ, మట్టపల్లి యాదగిరి, మారుపాక ప్రభాకర్, అయిలయ్య యాదవ్, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# నాయక్ నగర్ ఆర్‌యూబీ నిర్మాణంపై ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గంలోని వినాయక్ నగర్ డివిజన్ పరిధిలో ప్రతిపాదించిన ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణంపై స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌యూబీ నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ చేపట్టడంతో పలువురు తమ ఇళ్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌యూబీ నిర్మాణం అమలైతే ఇప్పటికే ఇరుకుగా ఉన్న కాలనీ రోడ్లు మరింత ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని స్థానికులు తెలిపారు. అలాగే గోడల నిర్మాణం కారణంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం కాలనీలోకి ప్రవేశించలేని పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కలిసి సమస్యను వివరించేలా బాధితులకు అవకాశం కల్పించారు. కాలనీవాసుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత డీజీఎం అధికారులతో చర్చించి ప్రజలకు అనుకూలంగా పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేశ్వరి, వీరేశం, సుధాకర్, శ్రీనివాస గుప్తా, శ్రీధర్ బాబు, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్ ఇయర్ ఆరో సెమిస్టర్ ఫలితాల్లో నలంద విద్యార్థుల ప్రభంజనం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ రెగ్యులర్ ఆరవ సెమిస్టర్ ఫలితాల్లో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక జీపీఏతో పాటు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారని చైర్మన్ నూకల శ్రీ రంగారెడ్డి కర్రస్పాండెంట్ డోలి సత్యనారాయణ, డైరెక్టర్ డా"సాధన, ప్రిన్సిపాల్ వై కృష్ణ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కే శంకర్ తెలియజేశారు. అత్యధిక జిపిఏ సాధించిన విద్యార్థుల వివరాలు బిఎస్సి ఎంపీసీ నాలుగోవ ఎంపీసీఎస్ విభాగంలో సహీయ షహరిన్ 8.22, షేక్ సాదియామీర్ 8.00, కోవెల చందన 7.84, చెవుల తులసి 7.31,బీఎస్సీ బిజెడ్ సి నాలుగవ బిజెడ్ జి విభాగంలో కట్ల మానస 8.69, సయ్యద్ సమరిన్ 7.33, భరత్ 7.15, మాసాని శృతి 7.04, బీకాం కంప్యూటర్స్ నాలుగోవ జనరల్ విభాగంలో లోయ ప్రణీత 8.77, భానోత్ అంకిత 8.52, గోగు రాకేష్ 7.98, గువ్వా మధుబాల 7.92, గంగరబోయిన సౌజన్య 7.71 బి ఎ విభాగంలో షేక్ అన్వర్ 8.05, మదుపెద్ది స్వాతి 7.48, ధారావత్ జీవన్ కుమార్ 7.04, 28 పైగా డిస్ట్రక్షన్లు సాధించారని తెలియజేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ శంకర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# దేవరుప్పుల లో దొంగ నోట్ల ముఠా అరెస్ట్

- **రూ.3 లక్షల నకిలీ కరెన్సీ, బ్రీజా కారు స్వాధీనం, నలుగురికి రిమాండ్.**




దేవరుప్పుల / జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని దేవరుప్పుల మండల కేంద్రం లో నకిలీ కరెన్సీ నోట్లు ముద్రిస్తున్న అంతర్జిల్లా ముఠాను పోలీసులు అరెస్ట్ చే శారు. వారి వద్ద నుంచి రూ. 3 లక్షల విలువైన నకిలీ నోట్లు, ముద్రణ సామ గ్రి, నగదు, కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకా రం,దేవరుప్పుల గ్రామానికి చెందిన చిం త సుదర్శన్ ఇంట్లో నకిలీ నోట్లు తయా రు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచా రం అందడంతో ఎస్సై సృజన్ కుమార్ తన సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో నోట్లు ముద్రిస్తున్న సమయంలోనే నలుగురు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. నిందితులు జగిత్యాల జిల్లాకు చెందిన సయ్యద్ రసూల్, కడవెండికి చెందిన బషిపాక అంజయ్య, దేవరు ప్పుల కు చెందిన చింత సుదర్శన్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లికి చెందిన గో పాలదాస్ లక్ష్మయ్య ఉన్నారు. నిందితు ల వద్ద నుంచి ఒక వైపు మాత్రమే ప్రింట్ చేసిన రూ.3 లక్షల విలువైన 500 రూ పాయల నకిలీ నోట్లు (150 ఏ4 షీట్లు), రూ.85 వేల అసలైన భారత కరెన్సీ, నోట్ల ముద్రణకు ఉపయోగిస్తున్న ఎప్స న్ బ్లాక్ ప్రింటర్, 600 నల్ల కాగితాల షీట్లు, ఒక వైట్ కలర్ వితారా బ్రీజా కా రు (టీఎస్ 21 ఎం 5330), నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. నిందితులపై దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, వర్ధన్నపేట ఏసీపీ నరసయ్య పర్యవేక్షణ లో విచారణ చేపట్టారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి రిమాం డ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

# దేశీయ తుపాకుల తయారీ ముఠా గుట్టురట్టు చేసిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్: దేశీయ తుపాకుల తయారీ ముఠా గుట్టును హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాలోని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు దేశీయ తుపాకులు, ఏడు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఆయుధాలు ఎక్కడి నుంచి తెచ్చారు? ఎవరికి సరఫరా చేయాలనుకున్నారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

* **జిల్లా అధ్యక్షులు పూనా రవీందర్ చారి**

ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్, వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ముందు విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు పూనా రవిందర్ చారి, ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి మాట్లాడుతూ జి.ఓ.272కు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల దొంగిలించబడిన బంగారానికి సంబంధించి నిరాధారమైన రికవరీ చర్యల నుండి స్వర్ణకారులకు రక్షణ లభిస్తుందన్నారు. చేనేత, గీత కార్మికుల మాదిరిగానే, 50 ఏళ్లు పైబడిన స్వర్ణకారులకు కూడా రూ. 5 వేల పెన్షన్ అందించాలని, వృత్తిని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్న స్వర్ణకారులకు ఆర్థిక సహాయం చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. స్వర్ణకారుల వృత్తిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆమోదించిన 5 మెన్ కమిటి నివేదిక తమిళనాడు తరహా తెలంగాణలో అమలు చేయాలన్నారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ తరహా స్వర్ణకారుల కార్పోరేషన్ వెల్ఫేర్ బోర్డ్ తెలంగాణలో ఏర్పాటు చేయాలన్నారు. స్వర్ణకారుల పోలీస్ వేధింపులను ప్రభుత్వం అరికట్టాలి. విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం జిల్లా రాష్ట్ర కార్యదర్శి నెమలి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వెంకటేశం, పట్టణ అధ్యక్షులు బ్రహ్మచారి, కార్యదర్శి వేణు, కోశాధికారి కాశీనాథ్, శంకర్



దయాళ్ చారి, బ్రహ్మచారి, రవి, శ్రీనివాస్ చారి, జెఎల్ శ్రీనివాస్ చారి, నవీన్ రవీందర్ చారి, రమేష్ చారి, నరేష్ చారి, సిద్ధిరాములు, కిశోర్, నాగేందర్, స్వర్ణకారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

- **దేవలమ్మ నాగారం ప్రభుత్వ పాఠశాలకు బస్సు బహూకరణ**
- **సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం ప్రభుత్వ పాఠశాలకు ఏనుగు జంగారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి కళావతి దంపతులు పాలకవర్గం సమక్షంలో గురువారం స్కూలు బస్సును బహూకరించారు. ఈ సందర్భంగా సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ బస్సును బహూకరించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అడగగానే పాఠశాలకు స్కూల్ బస్సును బహూకరించిన ఏనుగు శ్రీనివాస్ రెడ్డి కళావతి దంపతులను కాలువతో ఘనంగా సత్కరించారు. ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, బొమ్మ శ్వేత, పాక రాములు, షేక్ పాతిమ, గట్టు ప్రశాంత్ శ్రీ ఆది మహావిష్ణువు దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంత జంగారెడ్డి, రామాలయం చైర్మన్ రాజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ జిల్లాలో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల నోటిఫికేషన్ కు సంబంధించి కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పరిధిలో ఉన్న మెదక్, తూప్రాన్, రామాయంపేట, కుల్చారం పాఠశాలలు, జూనియర్ కళాశాలలో,మెదక్ డిగ్రీ కళాశాలలో మొత్తం 23 ఖాళీ పోస్టు ఉన్నట్లు పేర్కొన్నారు వీటిలో జూనియర్ లెక్చరర్లు(తెలుగు ,ఇంగ్లిష్ బోటనీ), పీజీటీలు తెలుగు కాకుండ మిగత అన్ని సబ్జెక్టులు) టీజీటీలు(తెలుగు, హిందీ, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్) పిజికల్ డైరెక్టర్, పిఈటి, లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులు నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉండాలనీ,గురుకుల విద్యాసంస్థల నిబంధనల మేరకు మహిళా విద్యాసంస్థలలో మహిళలకే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఖాళీగా ఉన్న వివిధ బోధనా పోస్టులను 202627 సంవత్సరానికి పార్ట్ టైం ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు 26062026 నుండి 04072026 వరకు తమ ఒరిజినల్ , జిరాక్స్ పత్రాలతో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తుల పరిశీలనానంతరం 06072026 ఉదయం 10:00 గంటలకు TGSWRS/JC(G) మెదక్ లో సబ్జెక్టు నిపుణుల కమిటీ ద్వారా డెమో , ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి ఇతర వివరాల కోసం మెదక్ జిల్లా సమన్వయకర్త అయిన అనురాధ 9059526124 ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు.

# ట్రాన్స్ ఫార్మర్ తో లోవోల్టేజ్ కు చెక్

**- 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నూతన ట్రాన్స్ ఫార్మర్ పాటతో తో లోవోల్టేజ్ సమస్యకు చెక్ పడిందని 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 17వ వార్డులో ఏర్పాటు చేసిన 160కెవి ట్రాన్స్ ఫార్మర్ ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతల ఉమామహేశ్వరి సాయిలు మాట్లాడుతూ 17వ వార్డులో 100కెవి ట్రాన్స్ ఫార్మర్ విద్యుత్ సరఫరా చేసే ప్రాంతంలో లో వోల్టేజ్ సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. సమస్య పరిష్కారానికి ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యాలను సామర్థ్యాన్ని పెంచాలని కోరుతూ ట్రాన్స్ కో ఏఈ ని సంప్రదించామన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ సూచనల మేరకు ట్రాన్స్ కో ఏఈ 100కెవి ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో 160కెవి ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేశారన్నారు. 17వ వార్డు పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదని గోపాల్, సైదులు, ట్రాన్స్ కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ ను ఉపయోగంలోకి తీసుకరావాలి

* **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ను ఉపయోగంలోకి తీసుకరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ఆర్టీసీ అధికారులు కోరారు.గురువారం గరిడేపల్లి మండల సిపిఐ సమితి ఆధ్వర్యంలో,నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ధర్నా చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిడేపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా బస్సులను ఆపటం వలన ట్రాఫిక్ జామ్ అయి ఆక్సిడెంట్లు జరుగుతున్నాయని, దీని వలన ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని ఆర్టీసీ బస్టాండ్ ను వేరే వాళ్ళు కబ్జా చేయకముందే దానిని ఉపయోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఆర్టీసీ ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సుధాకర్ రెడ్డి,రైతు సంఘం రాష్ట్ర నాయకులు బిల్లా కనకయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, కుందూరు వెంకటరెడ్డి,పోకల ఆంజనేయులు, ప్రతాని సైదులు,పంగ గోవిందు, గోధుమల ఈశ్వర చారి,ముండ్ల కోటయ్య, షేక్ పీర్ సాహెబ్,వేషాల ఆంజనేయులు,ఈదయ్య, నాగాచారి, నందిపాటి కాశయ్య, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పంగా సైదులు, మెండే లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఉన్నత విద్యకు 'ఫోన్-ఇన్' ప్రోత్సాహం

* **అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడిన అడిషనల్ కలెక్టర్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): పదో తరగతి పూర్తి చేసిన బాలికలు ఉన్నత విద్యను కొనసాగించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి నిర్వహించిన 'ఫోన్ఇన్' కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాలను వివరించి బాలికలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించారు. చదువు మధ్యలో ఆగిపోయిన లేదా ఇప్పటివరకు ఏ కోర్సులోనూ చేరని విద్యార్థినుల వివరాలను సేకరించి, వారి ఆసక్తులకు అనుగుణంగా ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చిట్యాల మండలానికి చెందిన గీతాంజలి అనే విద్యార్థిని మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్టీ) కోర్సుపై ఆసక్తి చూపడంతో ఆమెకు మహదేవ్‌పూర్ కేజీబీవీలో ప్రవేశం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన రమ్యకు ఆమె కోరుకున్న సీఈసీ గ్రూపులో మొగుళ్లపల్లి కేజీబీవీలో అడ్మిషన్ కల్పించారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహదేవ్‌పూర్ కేజీబీవీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఎల్టీ కోర్సు ప్రారంభించినట్లు తెలిపారు. టేకుమట్ల, కాటారం, గణపురం కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉండగా, చిట్యాల, భూపాలపల్లి, రేగొండ, మొగుళ్లపల్లి, మల్హర్‌రావు, మహాముత్తారం, పలిమెల కేజీబీవీల్లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కోర్సుకు 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం తదితర సౌకర్యాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థినులు తమ అభిరుచులకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాక సందర్భంగా ఈ నెల 28 న నల్గొండ జిల్లా కేంద్రం లోని ఎన్. జి కళాశాల మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన నల్గొండ పట్టణం లోని ఎన్ జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, వాహన పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణం చుట్టూ బలమైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ఇరువైపులా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కళాకారుల కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ మొత్తాన్ని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. మైదానంలో ఎక్కడా ఎత్తుపల్లాలు లేకుండా సమానంగా మొరం వేసి లెవలింగ్ చేయాలని, వర్షం వచ్చినా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని చెప్పారు. గ్రౌండ్ మొత్తాన్ని రోలింగ్ చేసి తీర్చిదిద్దాలని, పరిసర ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని సూచించారు.ముఖ్యమంత్రి ప్రసంగించే ప్రధాన వేదికను ఎత్తుగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# నల్లగొండ నాలుగు హత్యల కేసులో వీడిన మిస్టరీ..!

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : కుటుంబ ఆస్తి వివాదమే హత్యలకు కారణమని పోలీసుల నిర్ధారణ హసీన మొదటి భర్త కూతురు, అల్లుడు అల్లుడి అక్క కలిసి కుట్ర పన్నినట్లు గుర్తింపు. హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీషీటర్లతో హత్యలు చేయించినట్లు దర్యాప్తులో వెల్లడిహత్యకు గురైనవారు సుల్తాన్ (45), హసీన (40), ముజమిల్ (20), అక్సర (11).హసీన పేరుపై కోటి రూపాయల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు సమాచారం..! ఆస్తిని ఇతరులకు కాకుండా సుల్తాన్ పిల్లలకు ఇవ్వాలనే నిర్ణయంపై కక్ష పెంచుకున్నట్లు అనుమానం.సుపారీ ఇచ్చి దారుణ హత్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తింపు.పోస్టుమార్టం నివేదికలో భయానక విషయాలు.సుల్తాన్ శరీరంపై 6 కత్తిపోట్లు.హసీనపై 7 కత్తిపోట్లు అక్సరపై 9 కత్తిపోట్లుముజమిల్ పై ఏకంగా 16 కత్తిపోట్లు..! హంతకులకు భయపడి మంచం కింద దాక్కున్న అక్సరను బయటకు లాగి హత్య చేసినట్లు అనుమానం.నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు. కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం..!

# ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న కీతవారిగూడెం




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గ్రామం పాడిపంటలతో సుఖ సంతోషాలతో శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాందిమియా కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలోకులమతాలకు అతీతంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ,ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని. అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో,వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్ మియా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొని భక్తి పరవశ్యంతో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలు మరియు నిర్వహణ కమిటీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడగా, గ్రామ ప్రజల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.

# పిఆర్ సి ప్రకటించి, వెంటనే అమలు చేయాలి

* **తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని సత్య సాయి మందిరంలో నిర్వహించిన తపస్ అభ్యాస వర్గ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ కార్డుల సంబంధించిన విధివిధానాలు వెంటనే ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వకుండా వారి జీతాల నుండి 1.5 శాతం తీసుకోవడం సరైంది కాదని, వెంటనే పెండింగ్ డి ఏ లను విడుదల చేయాలని, పిఆర్సిని ప్రకటించి, వెంటనే అమలు చేయాలని, జీవో 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సి పి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలి అని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మోడల్ స్కూల్, కేజీబీవీ, రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్ధూ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, రంగా రెడ్డి, వెంకట స్వామి, జిల్లా కోశాధికారి మంగ నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులు మెట్టు శేఖర్, శ్రీధర్ రెడ్డి, మాధవ రెడ్డి , జిల్లా, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

* **తిరుమలాపూర్‌లో విషాదం... శోకసంద్రంలో కుటుంబం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల, (ప్రజా స్ఫూర్తి): ఆటపాటలతో ఇంటిల్లిపాదిని అలరించే రెండేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందిన విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంచు బీరన్న-మౌనిక దంపతుల కుమార్తె అన్వి (2) ఇంటి సమీపంలో తోటి చిన్నారులతో కలిసి ఆడుకుంటుండగా పక్కింటి వద్ద ఉన్న నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కొంతసేపటి తర్వాత చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు గాలింపు చేపట్టారు. అనంతరం తొట్టిలో ఉన్న చిన్నారిని గుర్తించి బయటకు తీశారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిసింది.అన్వి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించగా, గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఆటలాడుకుంటూ వెళ్లిన చిన్నారి విగతజీవిగా మారడంతో గ్రామస్తులు సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

* ప్రభుత్వ బడుల మూసివేత ఆలోచనలు విరమించుకోవాలి.
* కలెక్టరేట్ ఎదుట టీఎస్ యుటిఎఫ్ నిరసన



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : ఎస్టిఎఫ్ఐ (స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) పిలుపులో భాగంగా టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల,విద్యారంగ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి టి ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అశాస్త్రీయమైన ఎన్ ఈ పి 2020 ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేతను ఆపివేయాలని, అవసరం ఉన్న చోట నూతన పాఠశాలలను తెరవాలని, విద్యాహక్కు చట్టానికి సవరణ చేసి సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు నుఇవ్వాలని, టెట్ పరీక్ష లో సర్వీస్ ఉపాధ్యాయులకు వెయిటేజ్ ఇస్తూ ఆఫ్లైన్ లో నిర్వహించాలని , ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టులో పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని, పిఆర్సీకి రిపోర్ట్ తెప్పించుకుని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏ లను విడుదల చేయాలని , ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి, ఉద్యోగులకు హెల్త్ కార్డులను జూన్ చివరి నాటికి అందజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టే సర్దుబాటు ప్రక్రియ విద్యార్థుల అవసరం మేరకే ఉండాలని కోరారు. తదనంతరం నిరసన కార్యక్రమాలు పాల్గొన్నవారు డిఆర్ఓ దశరథ కి మెమోరండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాసా చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, నల్ల నరసింహ,పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, ఉపాధ్యక్షులు నర్రా శేఖర్ రెడ్డి, జి. అరుణ, కోశాధికారి వడ్డ రాజు, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి, నలపరాజు వెంకన్న, యాదగిరి, చిన వెంకన్న, కొమర్రాజు సైదులు, గంటల వెంకట్, భాను ప్రకాష్, నరసింహామూర్తి, వరలక్ష్మి, సురేందర్ రెడ్డి మండలాల బాధ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## రాజ్యాధికార సమరభేరి సభ కు హాజరు కావాలని ముధోల్ ఎమ్మెల్యే కు ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, భైంసా: తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జులై 5వ తేదీన భువనగిరి జిల్లాలో నిర్వహించబోయే ప్రతిష్టాత్మక 'రాజ్యాధికార సమరభేరి సభ'కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ కు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి , ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ కొమ్ముల ప్రవీణ్ రాజ్,నిర్మల్ జిల్లా అధ్యక్షులు గైని సాయి మోహన్,ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యేను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను సమర్పించారు.ఈ సందర్భంగా టీఆర్పీ నాయకులు మాట్లాడుతూ భువనగిరి జిల్లాలో జులై 5న జరగబోయే రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ సభకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విచ్చేసి విజయవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనున్న ప్రముఖులకు ఈ ఆహ్వాన పత్రిక అందజేసిన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి,జెడ్ లోడ్ శంకర్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ ,పార్టీ ముఖ్య నాయకులు మారుతి,అలాగే పార్టీకి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నార్కోటిక్ డాగ్స్ బృందంతో గరిడేపల్లి లో ముమ్మర తనిఖీలు

* డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం.



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిని నిర్మూలించడమే లక్ష్యంగా పోలీసు శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. గురువారం నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి గరిడేపల్లి మండల కేంద్రము, పరిసర గ్రామాల్లో పలు ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాల కదలికలపై నిఘా ఉంచేందుకు ఈ తనిఖీలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని హోటళ్లు, ప్రైవేట్/ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల పరిసరాలు, టీ స్టాళ్లు, కిరాణా దుకాణాలలో నార్కోటిక్ డాగ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మత్తు పదార్థాల విక్రయాలు జరిపినా, రవాణా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయాలు మరియు వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు అందించాలని ఎస్ఐ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.డ్రగ్స్ రహిత మండలంగా మార్చేందుకు వ్యాపారులు, యువత, తల్లిదండ్రులు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) లో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ కొత్తగూడెం పట్టణంలో గురువారం ప్రారంభమైంది. బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ఓటర్లకు ఇంటింటికి వెళ్లి ఫారాలను అందచేస్తున్నారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించుటకుగాను కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఎస్ఐఆర్‌ను చేపట్టింది. గురువారం నుంచి జూలై 24వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూర్తి చేసిన ఫారాలను తిరిగి తీసుకునే ప్రక్రియను చేపట్టనున్నారు. తదనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. ఈ విషయమై ఇప్పటికే బీఎల్ఓలు, ఇతర అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఓటర్లు తమ యొక్క వివరాలను నిరభ్యంతరంగా, నిర్భయంగా బీఎల్ఓలకు తెలియజేయాలని ఉన్నతాధికారులు సూచించారు.

## భైంసాలో వికలాంగుల బడి బాట 2026 కార్యక్రమం




ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో స్నేహా సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వికలాంగుల బడి బాట 2026" కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వికలాంగ పిల్లలకు విద్య, వైద్యం పునరావాస సేవలు అందించడం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సహాయ పరికరాలు, విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు, మండల విద్యాధికారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రత్యేక పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



ప్రజాస్ఫూర్తి, నల్గొండ : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, నషా ముక్త్ అభియాన్ లో భాగంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజ శాంతి భద్రతలకు,యువత భవిష్యత్తుకూ తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. నేటి సమాజంలో ముఖ్యంగా విద్యార్థులు ,యువతను లక్ష్యంగా చేసుకుని మాదక ద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తత చాలా అవసరం అని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులు "డ్రగ్స్‌కు నో - ఆరోగ్యకరమైన జీవితానికి యస్", "మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి మనందరం భాగస్వాములు కావాలి" అనే సందేశాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ స్నేహితులు, కుటుంబ సభ్యుల్లోనూ అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అంజి రెడ్డి,ఎస్బి సీఐ ఆది రెడ్డి, నార్కట్ పల్లి సీఐ సురేష్, ఎస్.ఐ విష్ణు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, భైంసా: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భైంసా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను సందర్శించి వాటి ప్రస్తుత స్థితిగతులను పరిశీలించారు. ఈ వారాంతంలో జరగనున్న మంత్రి పర్యటన సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు భైంసా మున్సిపాలిటీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి, మున్సిపల్ కమిషనర్ సిద్ధిఖా కుతిజా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు,శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, 18వ వార్డు కౌన్సిలర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం లో గురువారం పలువురు నాయకులు, అభిమానులు కేక్ కట్,బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీతో పాటు, కాసరబాద రోడ్ లోని అపూర్వ బధిరుల పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అన్నదానం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మర్యాద సైదులు యాదవ్, లింగమంతుల దేవస్థానం చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, కౌన్సిలర్ జ్యోతి శ్రీ విద్యా కరుణాకర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు యలగబోయిన మధు యాదవ్, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న, మాలోతు కమల్ చంద్రు నాయక్, నాయకులు బోల్క వెంకట్, వీరబోయిన లింగయ్య యాదవ్, తూము వెంకన్న, కోడి లింగయ్య,బడుగుల సైదులు, కంచుగట్ల జానయ్య, ఉగ్గం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వాడకం వ్యక్తిగత సమస్య కాదు: ఎస్పీ రోహిత్‌రాజు

* జనసంద్రంలా మాదకద్రవ్యాల నిర్మూలన ర్యాలీ




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డ్రగ్స్ వాడకం అనేది వ్యక్తిగత సమస్య కాదని, ఇది సామాజిక రుగ్మత అని, దీనిపై పోలీసులతోపాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహనలో భాగంగా గురువారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుండి ప్రకాశం స్టేడియం వరకు సాగిన ఈ ర్యాలీలో స్థానికులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొనడంతో జన సంద్రంలా మారింది. అనంతరం ప్రకాశం స్టేడియంలో మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలన్నారు. క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి సానుకూల ప్రత్యామ్నాయాలను అలవాటు చేసుకుని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.సి.వి.రమణ, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్‌లు హెచ్.అబ్దుల్ రషీద్, బి.మరియదాసు, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లేనినా, పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సఖి కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): మహిళలకు అండగా నిలవాల్సిన సఖి కేంద్రాలు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. పట్టణంలోని వన్‌స్టాప్ సెంటర్ (సఖి కేంద్రం)ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి సేవల తీరును సమీక్షించారు. కేసుల పురోగతి,రికార్డులు, బాధిత మహిళలకు అందుతున్న సేవల వివరాలను ఎమ్మెల్యే నిశితంగా పరిశీలించారు. సహాయం కోసం వచ్చే ప్రతి మహిళకు సకాలంలో స్పందిస్తూ, న్యాయం అందే వరకు అండగా నిలవాలని సిబ్బందికి సూచించారు. మహిళల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా పనిచేయాలని ఆదేశించారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా సఖి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, రక్షణ సేవలు అర్హులైన ప్రతి మహిళకు చేరేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ తనిఖీ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేటి యువత మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలి

: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా




ప్రజాస్ఫూర్తి, భైంసా : నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు. 'మిషన్ పరివర్తన'లో భాగంగా స్థానిక దీక్ష జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ వికసిత్ భారత్ కి పెహచాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత యాంత్రిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా యువత మత్తు పదార్థాల బారిన పడుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావడం అంటే జీవితాన్ని నాశనం చేసుకోవడమేనని, దీని నుంచి బయటపడటానికి యువత దృఢ సంకల్పంతో ఉండాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో ఇది నా చెట్టు కార్యక్రమంలో భాగంగా మర్రిగూడ 14వ డివిజన్ లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి బొజ్జ కిరణ్ కుమార్ జూనియర్ లెక్చరర్ కళ్యాణి చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగాక బొజ్జ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని దానికి ప్రతి ఒక్కరము కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడటంలో భాగస్వాములు కావాలని మర్రిగూడ 14 డివిజన్ ప్రజలకు పిలుపునిచ్చారు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు చెట్లు నాటితే క్షేమం చెట్లు నరికితే క్షామం అందుకే ప్రతి ఒక్కరు ఈ వాన కాలంలో కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి విద్యార్థులను ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్, అనిరుద్, సూర్య ,వేదాన్ష్ ,చరణ్, కాలనీ పిల్లలు పాల్గొన్నారు

# ఐ.ఎన్.టి.యు.సి (ఫెడరేషన్) ఖమ్మం జిల్లా జాయింట్ సెక్రటరీ ఏపూరి సైదులు



ప్రజాస్ఫూర్తి , ఖమ్మం జిల్లా : ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఫెడరేషన్) ఖమ్మం జిల్లా జాయింట్ సెక్రటరీ ఏపూరి సైదులు ని నియమిస్తున్నామని. జిల్లా అధ్యక్షులు కెంబసర్తి నాగేశ్వరరావు తెలిపారు. అట్టి నియామక పత్రాన్ని ఐ.ఎన్.టి.యు.సి (ఫెడరేషన్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బుద్ధారం మురహరి చేతుల మీదుగా హైదరాబాద్ లోని ఐ.ఎన్.టి.యు.సి (ఫెడరేషన్) కార్యాలయంలో నియామక పత్రాన్నీ అందజేశారు. ఈ సందర్భంగా ఏపూరి సైదులు మాట్లాడుతూ అసంఘిటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తామన్నారు. వారికీ అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి (ఫెడరేషన్) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బట్టిని సుమన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోహీర్ లింగ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎంహెచ్‌వోను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు పూర్తిస్థాయిలో అందించేందుకు డీఎంహెచ్‌వో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గిరిజనులు అధిక సంఖ్యలో నివసిస్తున్న భద్రాద్రి జిల్లాలో గిరిజన వ్యక్తి డీఎంహెచ్‌వోగా ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించడంతోపాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయుటకు డీఎంహెచ్‌వో కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ట్రెజరర్ బానోత్ రమేష్, జేఏసీ కో కన్వీనర్ మురళీకృష్ణ, డాక్టర్ ప్రసాద్, మోహన్, జానకి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

*** జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**

వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం - 2026" సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్" కార్యక్రమాల్లో భాగంగా గురువారం వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పే ఉద్దేశ్యంతో క్రికెట్ టోర్నమెంట్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ టీమ్, ప్రెస్ టీమ్, డాక్టర్స్ టీమ్, అడ్వకేట్స్ టీమ్, రెవెన్యూ టీమ్ , మున్సిపల్ కార్యాలయ టీమ్‌లు పాల్గొన్నాయి.



ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా గౌరవ అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమం ప్రారంభంలో భాగంగా గౌరవ అతిథులు టార్చ్ రిలే నుండి క్రీడా జ్యోతిని అందుకొని,సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్ ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం టోర్నమెంట్‌కు సంబంధించిన ప్రత్యేక టీ షర్ట్ ను ఆవిష్కరించి పాల్గొన్న జట్లతో మార్చ్ పాస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గౌరవ అతిథులు టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించడం జిల్లా పోలీస్ శాఖకు అభినందనీయమని తెలిపారు. నేటి నుండి ప్రారంభమైన సర్ ఎన్యూమేటర్ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, సమాజంలో డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలను ఎదుర్కోవడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం అత్యంత అవసరమని తెలిపారు.

# దేవస్థాన ఆదాయం నుండి గ్రామాభివృద్ధికి వాటా కేటాయించాలి

**- శ్రీ లక్ష్మీదేవి దేవస్థాన ఆలయ ఈవోని కోరిన చింతగూడ గ్రామ ప్రజలు**

ప్రజాస్ఫూర్తి ,జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లోని చింతగూడ గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీదేవి దేవస్థానం ఆలయ ఆదాయం నుండి గ్రామాభివృద్ధికోసం పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీకి వాటా కేటాయింపు జరుపాలని చింతగూడ గ్రామస్థులు ఆలయ అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీదేవి ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల వలన గ్రామంలో రోడ్లు దెబ్బతింటున్నాయని, గ్రామంలో ఆలయం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాభివృద్ధి , గ్రామంలోని ఇతర ఆలయాల అభివృద్ధి జరిగిందేమీ




లేదని గ్రామస్థులు అధికారులతో వాదించారు. గ్రామదేవత దేవాలయ ఆదాయం ద్వారా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరుతూ గురువారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులకు గ్రామపంచాయతీ తీర్మానంతో కూడిన వినతిపత్రాన్ని మండల పరిషత్ తాజా మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆలయ ఈవో రవికి అందజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఆసంపెల్లి అనిల్, నాగుల అభిలాష్, గ్రామ వార్డు మెంబర్లు మేకల అక్షయ్ కుమార్, ఆరె శ్రీనివాస్, కొండుకూరి సురేష్ మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన

జనగామ, ప్రజస్ఫూర్తి : జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి జి.శశి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వివిధ రూపాల్లో ఉండే అవకాశం ఉందని, ముఖ్యంగా అపరిచితులు ఇచ్చే చాక్లెట్లు, ఇతర వస్తువుల ను స్వీకరించేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కలిగిన చాక్లెట్లను తీసుకోవడం, వాటిని తమ వద్ద ఉంచుకోవడం లేదా ఇతరులకు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పద వస్తువులు కలిగి ఉన్నట్లు తెలిసిన వెంటనే ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. సీఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. రవీంద్ర, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎ. శ్రీనివాస్, పీఎల్వీలు జితేంద్ర, బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# బీఎల్ఓలకు ఓటర్లు సహకరించాలి: తహశీల్దార్ నాగరాజు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని చుంచుపల్లి మండల తహశీల్దార్ నాగరాజు కోరారు. మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో 2025 నాటికి మొత్తం 39,587 మంది ఓటర్లు నమోదై ఉన్నారని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఓటరు జాబితాలను నవీకరించేందుకు ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమం అమలుకు 41 మంది బీఎల్ఓలు, వారి పర్యవేక్షణకు నలుగురు సూపర్వైజర్లను నియమించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిని పూర్తి చేసి సంతకాలతో తిరిగి స్వీకరిస్తారని చెప్పారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో మండలంలో వంద శాతం ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాటతో మొదలైన నా ప్రయాణం..

## సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. "ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది" అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్'లో

### 20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజూ షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.

### కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

### 'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గోహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ విన్నప్పుడే నా క్యారెక్టర్ డిసైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.

## బ్యూటీ

# ముఖ సౌందర్యం కోసం..





### కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



### పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.



## సినిమా

## 10న జీ5లోకి హై జవానీతో
# ఇష్క్ హోనా హై



పూజాహెగ్డే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్లుగా నటించిన బాలీవుడ్ రొమాంటిక్ మూవీ హై జవానీతో ఇష్క్ హోనా హై థియేటర్లలో మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. రిలీజ్‌కు ముందు కోర్టు కేసుల కారణంగా వివాదాలతోనే ఈ బాలీవుడ్ మూవీ ఎక్కువగా వార్తల్లో నిలిచింది. కానీ ఔట్‌డేటెడ్ కాన్సెప్ట్ కారణంగా బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. యాభై కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేటర్లలో 70 కోట్ల లోపే వసూళ్లను దక్కించుకుంది. తాజాగా హై జవానీ తో ఇస్క్ హోనా హై మూవీ ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను జీ5 ఓటీటీ దక్కించుకుంది. జూలై సెకండ్ వీక్‌లో పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ మూవీ ఓటీటీలోకి రానున్నట్లు సమాచారం. జూలై 10న రిలీజ్ కానున్నట్లు టాక్ వినిపిస్తోంది.

JANHVI KAPOOR



## ఓటీటీలోకి
# జాన్వీ

ఇటీవలే పెద్ది మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది జాన్వీ కపూర్. రామ్‌చరణ్ హీరోగా నటించిన ఈ సినిమాలో అచ్చియమ్మ అనే మాస్ రోల్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. పెద్ది తర్వాత నెక్స్ట్ ప్రాజెక్ట్‌లపై ఫోకస్ పెట్టిన జాన్వీ కపూర్ ఓటీటీలోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఓ వెబ్‌సిరీస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే హిందీలో కాకుండా తమిళంలో ఈ సిరీస్ చేయబోతున్నదట. కురథి అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ వెబ్‌సిరీస్‌ను తమిళ టాప్ డైరెక్టర్ పా రంజిత్ నిర్మించబోతున్నారు. సర్మునమ్ దర్శకత్వం వహించనున్నారు. ఈ తమిళ వెబ్‌సిరీస్ కోసం జాన్వీ డిమాండ్ చేసిన రెమ్యూనరేషన్ ఆసక్తికరంగా మారింది. డెబ్యూ వెబ్‌సిరీస్ కోసం ఇరవై కోట్లు రెమ్యూనరేషన్ తీసుకోబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఒక్కో సినిమాకు జాన్వీ కపూర్ ఐదు నుంచి ఆరు కోట్ల వరకు పారితోషికం తీసుకుంటోంది. కురథి వెబ్‌సిరీస్‌కు మాత్రం మూడింతలు ఎక్కువగా రెమ్యూనరేషన్ స్వీకరిస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది.



## ఇడుపుకాయితం ఆరంభ వేడుక

ప్రియదర్శి హీరోగా నటిస్తోన్న ఇడుపు కాయితం మూవీ గురువారం గ్రాండ్‌గా లాంఛ్ అయ్యింది. ఈ కార్యక్రమానికి కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఫోక్ సింగర్ నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాకు వంశీరెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ డైరెక్టర్ సుకుమార్‌తో కలిసి నిర్మాత బన్నీవాస్ నిర్మిస్తున్నారు. ఇడుపుకాయితం టైటిల్‌ను డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ రివీల్ చేయగా... ముహూర్తపు సన్నివేశానికి సుకుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. దాంతో పాటు సినిమా ప్రీ లుక్ పోస్టర్‌ను మేకర్స్ అభిమానులతో పంచుకున్నారు. బైక్‌పై ప్రియదర్శి, నాగదుర్గ జర్నీ చేస్తున్నట్లుగా పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఇందులో వారిద్దరి ముఖాలు చూపించలేదు. హైదరాబాద్ వెళుతున్నట్లు –గా బోర్డ్ కనిపిస్తోంది.




## నారా లోకేష్ క్లాప్‌తో బాలకృష్ణ కొత్త సినిమా

సినిమాల స్పీడులో యంగ్ హీరోలతో పోటీపడుతున్నారు బాలకృష్ణ. డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ పూర్తికాకముందే మరో కొత్త ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకొచ్చారు. బాలకృష్ణ హీరోగా కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూవీ గురువారం అమరావతిలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమా ఓపెనింగ్ ఈవెంట్‌కు చీఫ్ గెస్ట్‌గా ఏపీ మంత్రి, బాలకృష్ణ అల్లుడు నారా లోకేష్ హాజరయ్యారు. మామ పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నారా లోకేష్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కూతురు నందమూరి తేజస్విని కెమెరా స్విఛాన్ చేశారు. బాలకృష్ణ ఇమేజ్‌కు తగ్గట్లుగా పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా డైరెక్టర్ కొరటాల శివ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. ఆగస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకాబోతుంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలకృష్ణ హీరోగా నటిస్తోన్న 112వ సినిమా ఇది. యువసుధ, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్లపై సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు.




## పదమూడేళ్ల కల నిజమైన వేళ

రాశీఖన్నా సినీ ప్రయాణం మొదలై పదమూడేళ్లు దాటిపోయింది. తెలుగు, తమిళ భాషల్లో కలిపి హీరోయిన్‌గా యాభైకిపైగానే సినిమాలు చేసింది. కానీ స్టార్ లీగ్‌లో అడుగుపెట్టలేకపోయింది. రాశీఖన్నా తర్వాత కెరీర్‌ను ఆరంభించిన పలువురు తక్కువ కాలంలోనే నంబర్ వన్ నాయికలుగా పేరుతెచ్చుకున్నారు. కానీ రాశీకి టాప్ హీరోయిన్ అనే ట్యాగ్ అందని ద్రాక్షగానే మిగిలింది. రాశీఖన్నా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దశాబ్దం దాటిపోయినా టైర్ 2 హీరోల దగ్గరే ఆగిపోయింది. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ రాశీఖన్నా సూపర్ స్టార్ రజనీకాంత్‌తో సినిమా చేసే ఛాన్స్ దక్కించుకుంది. రజనీకాంత్ హీరోగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న తమిళ మూవీ ధర్మన్ అఫీషియల్‌గా లాంఛ్ అయ్యింది. ఈ సినిమాను విలక్షణ నటుడు కమల్‌హాసన్ నిర్మిస్తోన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.